అమ్మా... బైలెల్లినాదే..

అమ్మలగన్న అమ్మ.. మహంకాళమ్మ

- నేటి నుంచి మూడు రోజులపాటు ఉత్సవాలు
- 12న ఘనంగా బోనాల ఊరేగింపు
- ఏర్పాట్లు పూర్తిచేసిన ఆలయ కమిటీ
- తరలిరానున్న ప్రముఖులు



దుబ్బాకలో మహంకాళి మాత ఆలయం



ఆలయంలో కొలువైన అమ్మవారు

దుబ్బాక: భక్తులకు కోరినన్ని వరాలిచ్చే మహిమ గల దేవతగా దుబ్బాకలో కొలువైన మహంకాళమ్మ ప్రసిద్ధి. చీకోడ్ వెళ్లే బైపాస్ రోడ్డులో ఉన్న అమ్మవారి ఆలయాన్ని ఎంతో అద్భుతంగా నిర్మించారు. ఆషాఢంలో అమ్మవారికి బోనాలు తీయడం ప్రత్యేకత.

12న బోనాల ఊరేగింపు

మహంకాళమ్మ ఉత్సవాలు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ప్రతియేటా ఆషాఢ మాసంలో అమ్మవారికి బోనాలు తీయడం ఆనవాయితీ. మహంకాళిదేవికి బోనాలు తీస్తే వర్షాలు సమృద్ధిగా కురిసి పాడిపంటలు బాగా పండుతాయని, ప్రజలు సుఖసంతోషాలతో ఉంటారని గ్రామస్తుల విశ్వాసం. అందులో భాగంగా శనివారం మహంకాళి మాతకు బోనాలు తీసేందుకు ఘనంగా ఏర్పాట్లు చేశారు. రెడ్డి, మున్నూరు కాపు సంఘంతో పాటు పలు సంఘాలకు చెందిన వారు అమ్మవారికి బోనాలు తీస్తారు. శనివారం సాయంత్రం 4 గంటలకు ఇంటికి రెండు బోనాలతో భక్తులు బయలుదేరి డప్పు చప్పుళ్లు, పోతరాజులు, బైండ్లల విన్యాసాల మధ్య ప్రధాన వీధుల గుండా ఊరేగింపుగా ఆలయానికి చేరుకుంటారు.

ప్రముఖుల రాక

అమ్మవారి ఉత్సవాల సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. వేద పండితులు వేలేటి జయరామశర్మ, రామకృష్ణశర్మ ఆధ్వర్యంలో వైదిక నిర్వహణ జరుగుతుంది. ఉత్సవాల సందర్భంగా ఆలయం వద్ద భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. బోనాల ఉత్సవాలకు ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎంపీ మాధవనేని రఘునందన్‌రావుతోపాటు పలువురు ప్రముఖులు హాజరుకానున్నారు.

అమ్మను పూజిస్తే శుభాలు



మహంకాళి మాత అమ్మల గన్న అమ్మ, అత్యంత శక్తి స్వరూపిణి. ఆ అమ్మను పూజిస్తే సర్వశుభాలు కలుగుతాయి. ఆషాఢంలో అమ్మవారికి బోనాలు సమర్పిస్తే ఆ కుటుంబాలు సంతోషంగా ఉంటాయి. వానలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండుతాయి.

– వేలేటి రామకృష్ణశర్మ, పురోహితుడు

ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి



మహంకాళమ్మ ఉత్సవాలు సందర్భంగా ఆలయం వద్ద అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆలయాన్ని సర్వాగ సుందరంగా తీర్చిదిద్దాం. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని చర్యలు తీసుకున్నాం.

– మల్లుగారి నర్సింహారెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్

క్లుప్తంగా

కలెక్టర్‌కు నివేదిస్తాం

అక్కన్నపేట(హుస్నాబాద్): గ్రామస్తులు ప్రజావాణిలో చేసిన ఫిర్యాదుపై అదనపు పీడీ శ్రీనివాస్ స్పందించారు. మండల పరిధి రేగొండలో ఇంటిపన్ను వసూలు, ఆయిల్‌పామ్ సాగు విషయంలో వసూళ్లకు పాల్పడ్డారని గ్రామానికి చెందిన మోహన్‌రెడ్డి, సంపత్, జయ, మేకల తిరుపతి ఇటీవల ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. దీంతో గురువారం అదనపు పీడీ నేతృత్వంలో గ్రామంలో విచారణ నిర్వహించారు. రెండేళ్లుగా ఇంటి పన్ను వసూల్ చేసినా వాటిని పంచాయతీలో జమచేయకాలేదని గ్రామస్తులు చెప్పారు. అలాగే 2021–22లో తొమ్మిది మంది ఆయిల్‌పామ్ సాగుకు ముందుకురాగా ఉపాధి హామీ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శి నలుగురు రైతుల నుంచి ఒక్కొక్కరి దగ్గర నుంచి రూ.15 వేలు వరకు వసూలు చేశారని ఆరోపించారు. అనంతరం అదనపు పీడీ శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామస్తుల సమక్షంలో విచారణ చేపట్టామని, వారిచ్చిన వాంగ్మూలాన్ని కలెక్టర్‌కు నివేదిస్తామని చెప్పారు. కార్యక్రమంలో డీఎల్‌పీఓ వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ భానోతు జయరాం, ఉపాధి హామీ ఏపీఓ ప్రభాకర్, పంచాయతీ కార్యదర్శి మహేశ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

బాలలతో పనిచేయిస్తే చర్యలు



సీఐ శ్రీనివాస్

దుబ్బాక: చిన్నారులను దుకాణాలు, హోటళ్లు, ఫ్యాక్టరీలు, ఇతర ప్రమాదకర ప్రాంతాల్లో పనులు చేయిస్తే కఠిన చర్యలు తప్పవని సీఐ పాలపు శ్రీనివాస్ హెచ్చరించారు. గురువారం పోలీస్ సర్కిల్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. బాలలను పనిలో పెట్టుకున్న వారికి, పనిలో పెట్టించిన వారిపైనా కూడా కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. అలాగే బాల్య వివాహాలు జరుగుతున్నట్లు సమాచారం ఉంటే చైల్డ్ వెల్ఫేర్ అధికారులకు తెలియజేయాలని సూచించారు.

సేంద్రియ ఎరువులతో భూసార పరిరక్షణ



యూరియా పంపిణీని పరిశీలిస్తున్న మల్లయ్య

మిరుదొడ్డి(దుబ్బాక): సేంద్రియ ఎరువులతో భూసారాన్ని కాపాడుకోవాలని వ్యవసాయ సహాయ సంచాలకుడు మల్లయ్య సూచించారు. స్థానిక పీఏసీఎస్ కేంద్రాన్ని గురువారం ఆయన రైతులకు అందజేస్తున్న యూరియా పంపిణీని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అధిక మోతాదులో యూరియా వాడితే వరికి అగ్గితెగులు ఆశించే అవకాశం ఉందని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఓ మల్లేశం, ఏఈఓలు పాల్గొన్నారు.

ఈఓపై దాడి హేయమైన చర్య



మాట్లాడుతున్న బాలబ్రహ్మం

కొండపాక(గజ్వేల్): భద్రాచలం ఆలయ ఈఓ లాలుకోట రమాదేవిపై దాడి చేయడం హేయమైన చర్య అని విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ మాతృ సంఘం రాష్ట్ర కార్యదర్శి బూర్గోజు బాలబ్రహ్మం అన్నారు. తిమ్మారెడ్డిపల్లిలో గురువారం ఆయన మాట్లాడుతూ ఆలయ భూముల పరిరక్షణ విషయంలో ఈఓ నిక్కచ్చిగా ఉండటాన్ని కొందరు జీర్ణించుకోవడం లేదన్నారు. దాడిచేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సంఘం నాయకులు నాగభూషణం, విష్ణు, నర్సింహులు, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

‘గురుకుల’ అభివృద్ధికి కృషి



విద్యార్థులతో మాట్లాడుతున్న వెంకటయ్య

దుబ్బాకరూరల్: మండలంలోని హబ్సిపూర్‌లోని మహాత్మాజ్యోతిబాపూలే గురుకుల పాఠశాలను రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి తన వంతుగా కృషి చేస్తానన్నారు. ఈ పాఠశాలను ఇక్కడ నుంచి తరలిస్తున్నట్టు వస్తున్న అపోహలు ఉన్నాయని, ఈ అంశాన్ని జిల్లా ఇన్‌చార్జి మంత్రి, ఎమ్మెల్యేల దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. అలాగే పాఠశాలలో మౌలిక వసతులు కల్పించేలా ఉన్నతాధికారులకు విన్నవిస్తానని తెలిపారు. ప్రహరీ, మరుగుదొడ్లు, క్రీడా ప్రాంగణం నిర్మించే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రిన్సిపాల్ గోపాల్‌రెడ్డి, తహసీల్దార్ సంజీవ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పరిశీలించారు.. హెచ్చరించారు

కలెక్టర్ హైమావతి పర్యటన



ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ హైమావతి

జగదేవ్‌పూర్(గజ్వేల్): జగదేవ్‌పూర్‌లో గురువారం కలెక్టర్ హైమావతి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. గ్రామానికి 42 మంజూరు కాగా 17 మంది నిర్మాణ పనులు ప్రారంభించారని అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. అలాగే తిగుల్ గ్రామంలోనూ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. కట్టుకుని వారుంటే గ్రామసభ నిర్వహించి అర్హులకు ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. లబ్ధిదారులకు మాత్రమే ఇసుక స్లిప్పులు ఇవ్వాలని, ఇళ్ల పేరిట అక్రమంగా తరలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం తిగుల్ ఉన్నత, ప్రాథమిక పాఠశాలలను సందర్శించారు. నూతన మెనూపాటించకపోవడంతో హెచ్‌ఎంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. డీఈఓకు నివేదిక పంపాలని ఎంపీడీఓ రాంరెడ్డిని ఆదేశించారు. తిగుల్‌లో పీహెచ్‌సీని పరిశీలించారు. ఆస్పత్రి పరిసరాల్లో ఉన్న పిచ్చిమొక్కలను వెంటనే తొలగించాలని కార్యదర్శిని ఆదేశించారు. వైద్యులు, సిబ్బంది విధులు సక్రమంగా నిర్వహించకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి, తహసీల్దార్ నిర్మల, ఎంపీడీఓ రాంరెడ్డి, ఎంపీఓ ఖాజా, ఆర్ఐ ఫహాద్, మాజీ ఎంపీటీసీ మహేందర్‌రెడ్డి, కొండపోచమ్మ డైరెక్టర్ జనార్దన్‌రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ భూమయ్య, కార్యదర్శులు రాంరెడ్డి, నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జ్ఞానమార్గంవైపు నడిపించేది గురువులే..

ప్రముఖ పంచాంగకర్త చంద్రశేఖర సిద్ధాంతి

గురుపౌర్ణమి సందర్భంగా గురువారం జిల్లాలోని పలు ఆలయాలు, పాఠశాలల్లో ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి గురువులను సన్మానించుకున్నారు.



వర్గల్(గజ్వేల్): చంద్రశేఖర సిద్ధాంతి దంపతులను సన్మానిస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు

వర్గల్(గజ్వేల్)/సిద్దిపేటఅర్బన్/బెజ్జంకి(సిద్దిపేట): అజ్ఞానాంధకారం నుంచి జ్ఞానమార్గం వైపు నడిపించేది గురువులేనని వర్గల్ క్షేత్ర వ్యవస్థాపకుడు, పంచాంగకర్త యాయవరం చంద్రశేఖరశర్మ సిద్ధాంతి అన్నారు. వర్గల్ సరస్వతి సన్నిధిలో ఆయన మాట్లాడారు. సన్మాన కార్యక్రమంలో భీష్మాగౌడ్, వెంకటకృష్ణారావు, సత్యనారాయణ, నర్సింహారావు, కృష్ణమూర్తి, శ్రీనివాస్, మల్లారెడ్డి, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు. సిద్దిపేట మండల పరిధిలోని తడ్కపల్లి విద్యారణ్య ఆవాస విద్యాలయంలో జరిగిన కార్యక్రమంలో పాఠశాల సహ కార్యదర్శి లింగమూర్తి మాట్లాడారు. కార్యక్రమంలో అధ్యక్షుడు శేఖరం, సరస్వతి విద్యాపీఠం జిల్లా సహ కార్యదర్శి సాంబశివరావు, పాఠశాల కార్యదర్శి నారాయణ, ప్రధానాచార్యులు నవీన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. బెజ్జంకి మండలం గాగిల్లాపూర్ ధ్యాన నిష్ఠామంలో భక్తులు భగవద్గీత, విష్ణు సహస్రనామాలను పరాయణం చేశారు. సాయిబాబా ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. ఎస్‌ఐ సౌజన్య వేడుకల్లో పాల్గొని పూజలు చేశారు. ఆలయంలో సీసీ కెమెరాలు ఏర్పాటుచేయాలని సూచించారు.

టారిఫ్ తగ్గించాలని కేబుల్ ఆపరేటర్ల ధర్నా



ఎస్ఎస్‌పీ ఛానల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న కేబుల్ ఆపరేటర్లు

సిద్దిపేటజోన్: ప్రజలపై అదనపు భారం వేసే పరిస్థితి లేదని, వెంటనే పెంచిన టారిఫ్‌లను తగ్గించాలని డిమాండ్ చేస్తూ కేబుల్ ఆపరేటర్లు గురువారం ధర్నా నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని శ్రీసాయి కమ్యూనికేషన్(ఎస్ఎస్‌పీ) ప్రధాన కార్యాలయం ఎదుట బైఠాయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టారిఫ్ పెంచడం వల్ల ఆపరేటలపై అదనపు భారం పడుతుందన్నారు. అలాగే విధులు నిర్వహిస్తున్న క్రమంలో అనేక ప్రమాదాలు జరుగుతున్నాయని, విద్యుత్ షాక్ వల్ల చనిపోయిన, అంగవైకల్యం పొందిన ఘటనలు చాలా ఉన్నాయని వాపోయారు. ఆపరేటర్ కంట్రోల్ రూమ్ వరకు ఫైబర్ వైర్ వేసే బాధ్యత యాజమాన్యం పైనే ఉండాలని, ఐదు ఉచిత కనెక్షన్లు ఇవ్వాలని, ప్రతి రీఛార్జ్‌పైనా ఒక్క రూపాయిని ఆపరేటర్ల సంక్షేమ నిధికి జమ చేయాలని, ప్రమాద బీమా అమలు చేయాలని, ప్రమాదవశాత్తు చనిపోయిన వారికి రూ.10 లక్షలు, అంగవైకల్యం చెందిన వారికి రూ.5 లక్షలు ఇవ్వాలని యాజమాన్యానికి వినతిపత్రం అందజేశారు. వారికి సీఐటీయూ జిల్లా కార్యదర్శి గోపాల్ స్వామి, సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లారెడ్డి సంఘీభావం ప్రకటించారు.

ప్రతిభ చూపితేనే ఉన్నత స్థానాలు

ప్రిన్సిపాల్ అనిత అబ్రహం



ఇన్ఫోసిస్ కార్యాలయం వద్ద విద్యార్థినులు

గజ్వేల్‌రూరల్: విద్యార్థులు నైపుణ్యతను చాటినప్పుడే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని గజ్వేల్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ అనిత అబ్రహం అన్నారు. క్షేత్ర పర్యటనలో భాగంగా కళాశాల స్కిల్ నాలెడ్జ్ విద్యార్థినులు హైదరాబాద్‌లోని పోచారంలోగల ఇన్ఫోసిస్ క్యాంపస్‌ను గురువారం సందర్శించారు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు సాధించడానికి అవసరమయ్యే అంశాలు, రిక్రూట్‌మెంట్ ప్రాసెస్‌ను అడిగి తెలుసుకున్నారు. ప్రిన్సిపాల్ అనిత మాట్లాడుతూ నూతన టెక్నాలజీని అందిపుచ్చుకొని తమ ప్రతిభను చూపి ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నారు. ఇన్ఫోసిస్ ఆధ్వర్యంలో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో కళాశాలకు చెందిన ఫిర్దోస్‌బేగం బహుమతి అందుకున్నారు. కార్యక్రమంలో టీఎస్‌కేసీ కో–ఆర్డినేటర్ డాక్టర్ ఉమారాణి, మెంటర్ సందీప్ తదితరులు పాల్గొన్నారు.

రూ.35 లక్షలతో సేవా కార్యక్రమాలు



కొండపాక(గజ్వేల్): మండలంలోని సిర్సనగండ్ల గ్రామానికి చెందిన యువకుడు సోమిరెడ్డి జనార్దన్‌రెడ్డి రూ.35 లక్షలతో పలు సేవా కార్యక్రమాలు చేపట్టి అందరి మన్ననలు పొందుతున్నారు. అతనికి చిన్ననాటి నుంచి ఊరన్నా, ప్రజలన్నా ఎనలేని అభిమానం ఏర్పరుచుకున్నారు. దీంతో తన సంపాదనలో కొంత సొమ్మును గ్రామస్తులకు అవరమయ్యే పనుల కోసం ఖర్చు చేస్తున్నారు. సుమారు రూ.25 లక్షలతో ఆహ్వాన తోరణం, అత్యవసరంలో వైద్యం కోసం రూ.10 లక్షలతో అంబులెన్స్‌ను ఏర్పాటు చేశారు. ఈ మేరకు తహసీల్దార్ ఎర్రోళ్ల శ్యామ్, త్రీటౌన్ సీఐ విద్యాసాగర్, ప్రభుత్వ ఆస్పత్రి వైద్యుడు శ్రీధర్ అంబులెన్సు సేవలను ప్రారంభించారు. గ్రామస్తులు జనార్దన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భగా జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామ బాగు కోసం తమ వంతుగా సేవా కార్యక్రమాలు చేపట్టానన్నారు. అంబులెన్సు నిర్వహణ బాధ్యత తానే భరిస్తానని చెప్పారు.

సొసైటీలకు ఇవ్వండి

హుస్నాబాద్‌రూరల్: మత్స్యకారుల సంక్షేమం కోసం ప్రభుత్వం ఉచితంగా అందించే చేప పిల్లలను కాకుండా వాటి డబ్బులను సొసైటీలకు ఇవ్వాలని మత్స్యకార సొసైటీ జిల్లా డైరెక్టర్ పెండ్యాల అయిలయ్య కోరారు. గురువారం ఆయన మాట్లాడుతూ సహకార సంఘం సమావేశంలో పలు తీర్మానాలు చేసి ప్రభుత్వానికి పంపించామన్నారు. కొండపోచమ్మ, రంగనాయకసాగర్, మల్లన్నసాగర్, గౌరవెల్లి ప్రాజెక్టు, హుస్నాబాద్ ఎల్లమ్మ చెరువుల వద్ద చేప పిల్లల ఉత్పత్తి కేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు.

నాచగిరిలో వేలంపాటలు

వర్గల్(గజ్వేల్): నాచగిరి క్షేత్రంలో గురువారం వివిధ వేలం పాటలు నిర్వహించారు. ఆలయ చైర్మన్ పల్లెర్ల రవీందర్ ఆధ్వర్యంలో ఈఓ విజయరామారావు, ఈఓ శ్రీధర్‌రెడ్డి పర్యవేక్షణలో వివిధ అంశాల కోసం వేలం పాటలు నిర్వహించారు. పూలహారాలు, అలంకరణ, వెండి, రాగి డాలర్లు, రక్షా కంకణాలు, శాలువాలు, శెల్లాలు, కనుములు సరఫరా కోసం పలువురు హక్కులు పొందినట్లు ఈఓ విజయరామారావు తెలిపారు. తలనీలాలు ప్రోగు చేసుకునే హక్కు రూ.4.56 లక్షలకు హెచ్చుపాటతో సికింద్రాబాద్‌కు చెందిన పి.ఎల్లయ్య; పాదరక్షలు భద్రపరచే హక్కును రూ.1.35 లక్షలతో నాచారం విజయలక్ష్మి దక్కించుకున్నట్లు చెప్పారు. స్వామివారి శేష వస్త్రాలు, టెంట్ సామగ్రి, ఒడి బియ్యానికి సంబంధించిన వేలం పాటలు వాయిదా పడ్డాయని తెలిపారు. కార్యక్రమంలో ధర్మకర్తలు నాగరాజు, శ్రీనివాస్, శ్రీహరి, కిష్టయ్య, పద్మ, జగన్నాథాచార్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

గంజాయి రహిత జిల్లానే లక్ష్యం

వర్గల్(గజ్వేల్): గంజాయి, ఇతర మత్తు పదార్థాలను నిర్మూలించి జిల్లాను గంజాయి రహితంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి అన్నారు. వర్గల్‌లో గురువారం నార్కొటిక్స్‌డాగ్స్‌తో తనిఖీలు నిర్వహించారు. అనుమానిత ప్రాంతాలపై పోలీసుల నిఘా కొనసాగుతుందని, యువత డ్రగ్స్ బారినపడి జీవితాలు నాశనం చేసుకోవద్దని హితవు పలికారు. డ్రగ్స్, మత్తుపదార్థాల సమాచారం తెలిస్తే డయల్ 100 లేదా 1908కు సమాచారమివ్వాలని సూచించారు. కార్యక్రమంలో డాగ్‌స్క్వాడ్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఇళ్ల మంజూరులో అపోహలు నమ్మొద్దు

మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి

చేర్యాల(సిద్దిపేట): ఇందిరమ్మ ఇళ్ల మంజూరు విషయంలో అపోహలు నమ్మొద్దని, అర్హులందరికీ ఇళ్లు అందుతాయని మాజీ ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి అన్నారు. పట్టణ కేంద్రంలోని పలు వార్డుల్లో మొదటి విడత ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను గురువారం ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ మొదటి విడతలో మంజూరైన లబ్ధిదారులు త్వరగా పనులు ప్రారంభించి పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో మేర్గ కృష్ణాగౌడ్, శ్రీకాంత్, రవి, ఆగంరెడ్డి, మల్లేశం, జయ, కళావతి, లీలసంజీవులు, నరేందర్, సతీశ్‌గౌడ్, చిరంజీవులు, చంద్రయ్య, లక్ష్మీనారాయణ, లింగం, నాగరాజు, దుర్గయ్య, రాము, శ్రీనివాస్‌రెడ్డి, జహీరొద్దీన్, సన్నీ, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సొంతింటి కల సాకారం

కొండపాక(గజ్వేల్): పేదలకు సొంతింటి కలను సాకారం చేసేలా ప్రభుత్వం కృషి చేస్తోందని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విరుపాక శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. కొండపాకలో ఇండ్ల నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల మంజూరు నిరంతర ప్రక్రియగా కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ పరశురాములు, లింగారావు, యాదయ్య, కనకరాములు, రమేశ్, స్వామి, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

‘మహిళా శక్తి’.. ఆర్థిక వృద్ధి



చిన్నకోడూరు(సిద్దిపేట): చంద్లాపూర్‌లో మహిళా శక్తి సంబరాలు

ఇందిరా మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా మహిళా సంఘాల సభ్యులు నిర్వహిస్తున్న సంబురాలు ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా గురువారం కూడా మహిళలు కార్యక్రమాలు నిర్వహించారు. అధికారులు పాల్గొని మహిళల ఆర్థికాభివృద్ధికి ఇందిరా మహిళా శక్తి పథకం ఎంతో దోహదపడుతుందన్నారు. వడ్డీలేని రుణాలను వినియోగించుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని పిలుపునిచ్చారు.



మిరుదొడ్డిలో మహిళా కళాకారులతో కళా ప్రదర్శన



బెజ్జంకిలో పాల్గొన్న అదనపు డీఆర్‌డీఓ సుధీర్, ప్రాజెక్ట్ మెనేజర్ విద్యాసాగర్ తదితరులు



గజ్వేల్: కొడకండ్లలో మాట్లాడుతున్న మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సర్దార్‌ఖాన్

సంక్షిప్త వార్తలు

◆ మందుబాబులకు జరిమానా

సిద్దిపేటకమాన్: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వారికి సిద్దిపేట కోర్టు జరిమానా విధించింది. సీఐ ప్రవీణ్‌కుమార్ వివరాల ప్రకారం పట్టణంలోని పలు ప్రాంతాలలో ఇటీవల నిర్వహించిన వాహన తనిఖీల్లో తొమ్మిది మంది పట్టుబడ్డారు. వారిని కోర్టులో హాజరుపర్చగా గురువారం విచారణ జరిపిన న్యాయమూర్తి రూ.21,500 జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు.

◆ సమస్యలు పరిష్కరించండి

గజ్వేల్‌రూరల్: అంగన్‌వాడీ కేంద్రాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఏగొండస్వామి డిమాండ్ చేశారు. మండల పరిధిలోని అనంతరావుపల్లి అంగన్‌వాడీ కేంద్రాన్ని గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్రంలో ఆయా లేకపోవడం వల్ల నాలుగేళ్లుగా చిన్నారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. అధికారులు స్పందించి ఆయాను నియమించాలని కోరారు.

◆ యూటీఎఫ్ సభ్యత్వ నమోదు

గజ్వేల్‌రూరల్: ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న పీఆర్సీని వెంటనే ఇవ్వాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర నాయకుడు సత్యనారాయణ డిమాండ్ చేశారు. మండల పరిధిలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో గురువారం యూటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న డీఏతోపాటు పీఆర్సీని ఇవ్వాలని, ఎస్‌జీటీలందరికీ ఎమ్మెల్సీ ఓటు కల్పించాలన్నారు. శ్రీనివాస్‌రెడ్డి, ప్రశాంత్, కనకరాజు, పాషా, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

◆ నూతన నియామకం

సిద్దిపేటకమాన్: ఎమ్మార్పీఎస్ జిల్లా నూతన అధ్యక్షుడిగా రాజును నియమించినట్లు జిల్లా ఇన్‌చార్జి కుమార్ తెలిపారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో గురువారం నిర్వహించిన సమావేశంలో నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కష్టపడిన ప్రతి కార్యకర్తకు గుర్తింపు ఉంటుందన్నారు. కార్యక్రమంలో పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

◆ బీఆర్ఎస్ జెండా ఎగురవేయాలి

చేర్యాల(సిద్దిపేట): త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో గులాబీ జెండా ఎగురవేసేలా ప్రతి కార్యకర్త కృషి చేయాలని బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు ముస్త్యాల బాల్‌నర్సయ్య పిలుపునిచ్చారు. పార్టీ సన్నాహక సమావేశాల్లో భాగంగా గురువారం మండలంలోని కడవేర్గు గ్రామంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. క్లస్టర్ ఇన్‌చార్జి మంచాల కొండయ్య, పార్టీ మండల అధ్యక్షుడు అనంతుల మల్లేశం, మాజీ ఎంపీపీ ఉల్లంపల్లి కరుణాకర్, పట్టణ అధ్యక్షుడు ముస్త్యాల నాగేశ్వరరావు, స్వప్న, యాదగిరి, సిద్ధిలింగం, అంజయ్య, ఐలయ్య, బాలయ్య పాల్గొన్నారు.

◆ దాతల సహకారంతో వసతులు

నంగునూరు(సిద్దిపేట): దాతల సహకారంతో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు వసతులు సమకూరుతున్నాయని ఎంఈఓ దేశిరెడ్డి అన్నారు. నంగునూరుకు చెందిన గోవిందరాజు, కావేరి దంపతులు గురువారం 70 మంది విద్యార్థులకు రూ.35 వేలు విలవ చేసే క్రీడా దుస్తులు అందజేశారు. కాంప్లెక్స్ హెచ్‌ఎం రామస్వామి, హెచ్‌ఎం జయపాల్ యాదవ్, ఉపాధ్యాయులు సిద్దు తదితరులు పాల్గొన్నారు.

◆ రైతుల అభ్యున్నతే ధ్యేయం

మద్దూరు(హుస్నాబాద్): రైతుల అభ్యున్నతే ధ్యేయంగా సహకార సంఘాలు పని చేస్తున్నాయని రేబర్తి పీఏసీఎస్ చైర్మన్ నాగిళ్ల తిరుపతిరెడ్డి అన్నారు. గురువారం నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా సొసైటీ పాలకవర్గంతో కలిసి మొక్కలు నాటారు. ఆయన మాట్లాడుతూ సహకార సంఘాల బలోపేతానికి రైతులు కృషి చేయాలన్నారు. సీఈఓ బోయిని శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

◆ ప్రభుత్వ బడులను కాపాడుకుందాం

చిన్నకోడూరు(సిద్దిపేట): ప్రభుత్వ బడులను కాపాడుకునే బాధ్యత మనందరిపై ఉందని ఎంఈఓ యాదవరెడ్డి అన్నారు. మండల పరిధిలోని కొండెంగలకుంట తదితర గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలలను గురువారం సందర్శించారు. విద్యార్థుల సంఖ్య, సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య, మెరుగైన వసతులు, ఉచిత నోట్‌బుక్స్, పాఠ్య పుస్తకాలు, యూనిఫామ్ అందజేస్తారన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపించాలని సూచించారు.

◆ సీసీ కెమెరాలతో నిరంతరం నిఘా

కోహెడరూరల్(హుస్నాబాద్): సీసీ కెమెరాలతో గ్రామాల్లో నిరంతరం నిఘా కొనసాగుతుందని ఎస్ఐ అభిలాష్ అన్నారు. బస్వాపూర్‌లో గురువారం ఆయన సీసీ కెమెరాల గురించి గ్రామస్తులకు అవగాహన కల్పించారు. గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు ముందుకు రావాలని సూచించారు. నేరాలు జరిగితే నిందితులను పట్టుకోవాడానికి ఎంతగానో ఉపయోగడతాయని చెప్పారు.